కథానిక :

దేవుడు వరమిస్తే...!

శ్రీ ఈరంకి వెంకటరావు

రాజుగారు చావుబ్రతుకులమధ్య కొట్టుకుంటూ బాధపడుతూ వున్న గది నిశ్శబ్దంగా లేదు. జనం చాలామంది వచ్చి వెడుతున్నారు. వీలయినంతమట్టుకు చడీ లేకుండానే నడుస్తున్నారు. అందరూ ఏదో గుసగుస లాడుకుంటున్నారు. ఎంత ధ్వని అయితేనేం? వైద్యులు చెప్పారు—ఇంక ఆయన వినలేడని. ఆయనికి ఏమాత్రం చైతన్యంవున్నా ప్రక్కని దుఃఖిస్తూ కూర్చున్న భార్య విచారమైనా ఆయన్ను లేపి ఉండేది.

అనేక రోజుల్నుంచి ఆ గదిలో దీపకాంతులు రాజుగారి మొగంమీద పడకుండా సేవకులు జాగ్రత తీసుకునేవారు. కాని, ఇప్పుడు తొందరలోను, హడావిడిలోను, విచారంలోను మునిగి ఎవరూ ఆ దీపకాంతులు రాజుగారి కళ్ళమీద పడి ఆయన దృష్టి చెదరిపోకుండావుండే జాగ్రత పడలేదు. వెలుగు ఆయన కళ్ళమీద పడితేనేం? వైద్యులు చెప్పారు—ఇంక ఆయన వెలుగు చూడలేడని.

ఇదివరకు స్వజనమే రా వీలులేనిచోటికి ఇప్పుడు అందరూ నిరాటంకంగా వస్తున్నారు. రాణీ రాజుచేతిని మృదువుగా తాకినప్పటికీ ఆయన చలించటం లేదు. చివరికి కళ్ళూ, నోరూ మూసుకుపోయాయి. ఆయన గుండె ఆగిపోయింది—

రాజుగారికి స్మృతి వచ్చేటప్పటికి అంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దత అతనికి ఉత్సాహాన్నీ ఉద్రేకాన్నీ కలిగించింది. ఆయనకు చెప్పరాని స్వేచ్ఛ కలిగింది. స్వర్గంలో ఉన్నట్టుగా ఉంది. గదిలో పువ్వుల సువాసన మత్తు కలిగిస్తోంది. తెరచిఉన్న కిటికీగుండా చల్లటిగాలి వీస్తోంది. కొవ్వొత్తి దీపాలు కొద్దిపాటి వెలుతురును ప్రసరింప జేస్తున్నాయి. రాజుగారి మొఖము, శిరస్సు, మినహాగా దేహమంతా ఉన్ని శాలువతో కప్పబడి వుంది. ఆయనవద్ద కాపలాగా ఉన్న పరిచారకులు నిద్రాదేవి ఒడిలో హాయిగా కన్నుమూశారు.

ఒంట్లో మాంద్యము తగ్గిపోయి, బాగా తెలివి వచ్చేటప్పటికి గడియారం పదకొండు గంటలు కొట్టింది. రాజుగారు ఇటూ, అటూ కదిలి, చిరునవ్వుతో లేచి కూర్చున్నారు. ఆయన నరాల శక్తు లన్నింటినీ కూడగట్టుకునేటప్పటికి ఆయన కొక కంఠం వినిపించింది. ప్రపంచమంతా తన కోసం వాపోతూంటే బలవంతంగా ఏదో ఒక శక్తి తన్ను లాగివేసే సమయంలో ఆయన కా మాటలు ఇట్లా వినిపించాయి—"నీ మరణానంతరం గూడా నేను నీకు ఒక గంట వ్యవధి నిస్తాను. ఆ గంట వ్యవధిలో నీవు జీవించా లని మనస్ఫూర్తిగా కోరేవారిని ముగ్గురిని నీవు చూడగలిగితే, నీవు తిరిగి బ్రతికివుండవచ్చు."

అదే యీ గంటవ్యవధియున్నూ. ఈ గంటే అతను మృత్యువు దగ్గరనుంచి లాగుకున్నాడు. అప్పుడే అందులో ఎన్ని క్షణాలు వృథా అయిపోయినాయో? తను ప్రజలకోసం రాత్రింబగళ్లు శ్రమపడ్డాడు. తనంటే ప్రజలు ఆమాత్రమైనా సానుభూతి చూపరా? అతను భయపడటానికి అవసరం కనిపించటం లేదు. జీవించడమే మహదానందం. తాను పూర్తిచేయవలసిన పనులు అనేకం మిగిలిపోయాయి.

గదిలోనుంచి బయలుదేరి సంచారం మొదలుపెట్టాడు. పహరా జవానులు గాఢ నిద్రావస్థలో వున్నారు. అది అన్యాయమనీ, ద్రోహమనియైనా వారికి తోచలేదు. తాను, తనరాజ్యం, తన ఘనతా అవన్నీ ఆ రాత్రివేళ ఒక లెక్కలోవి కావనీ, ఎవరూ తనను గుర్తించటమే లేదనీ తెలుసుకున్నాడు.

గది బయట ఎటు వెడదామా అని ఆలోచించాడు. రాణీదగ్గరకా—కాదు. ఆమె తన మరణానంతరం అనుభవించే బాధ తలుచుకుంటే అతనికి కంపరమెత్తింది. తాను ఆమెను దగ్గరకు తీసుకుని, ఆమె కన్నీళ్ళను తుడువగలిగేవరకూ ఆమె దగ్గరకు వెళ్ళదలచుకోలేదు. ఆ అవకాశంగూడా ఇంకెంత—ఒక గంటలో దొరుకుతుంది. కోటలో పన్నెండు గంటలు కొట్టేటప్పటికల్లా తను సజీవు డౌతాడు. ఆ విషయం తల్చుకుని అతను నిట్టూర్చాడు.

అతనికి తన జీవితాన్ని ప్రసాదించే వరకు మళ్ళీ జ్ఞాపక మొచ్చింది. తనరాజ్యం వెన్నెట్లో ప్రకాశిస్తోంది. "ముగ్గురు గాదు, మూడువేల మందిని చూడొచ్చు నా ప్రాణం కోరేవాళ్ళని. నా రాజ్యంలో నాకు శత్రు వెవడు?" అనుకున్నాడు.

అతను గేటులోంచి వెడుతూ మెట్లమీద ఏడుస్తూ కూర్చున్న పిల్లని చూశాడు. ఆ ప్రక్కనే వున్న జవాను "ఎందు కమ్మాయి, ఏడుస్తున్నావు?" అని అడుగుతున్నాడు.

"రాజుగారు చచ్చిపోయా రని అమ్మా, నాన్నా చూడటానికి వెళ్ళారు. మళ్ళీ వాళ్ళింతవరకూ రాలేదు. నాకు భయమేస్తోంది. ఆకలిగా వుంది. నా బొమ్మ చితికిపోయింది. రాజుగారు బతికివుంటేనే బాగుండేది" అన్నది ఏడుస్తూ.

ఆ సంఘటన రాజుకి కొద్ది ఆనందాన్ని మాత్రమే ఇచ్చింది. "అయితే నేను బతికివుండాలని కోరే నా ప్రజల్లో యీ పిల్ల మొదటిది అన్నమాట అనుకున్నాడు రాజు.

రాజుకి సంతానం లేదు. ఆ పిల్లని సముదాయించి ఓదార్చవాడే. కాని అతని కింకా చాలా పనుంది. వ్యవధి తక్కువ. అతను తన స్నేహితు డింటికి బయలుదేరి వెడుతున్నాడు. అందరికంటే ఆ స్నేహితుడంటే రాజుకి చాలా ఇష్టం. తను చనిపోయినట్టుగా ఆ స్నేహితుడు విని దిగాలుపడి పోతా డనే ఆలోచన స్ఫురించగానే అతనిలో కొంత నిరుత్సాహం ఏర్పడింది. అట్లా అనుకుంటూనే తన స్నేహితుడి ఇంటి ఆవరణలో ప్రవేశించాడు. ఇల్లంతా శోభాయమానంగా వెలుగుతోంది. గుమ్మా లన్నిటికీ జీను లమర్చబడ్డాయి. ఆ భవనమంతా సందడిగా వుంది. రాజుకి ఎక్కడ వెతికినా తనకి పరిచయమైన ముఖం మాత్రం కనుపించలేదు. అన్ని గదులూ ఒకదాని తర్వాత ఒకటిగా గాలించాడు. ఎక్కడా అతని మిత్రుడు కనుపించలేదు. ఒకవేళ తన మిత్రుడు తను చనిపోయినందుకు విచారంతో చనిపోలేదుగదా!

ఆఖరికి అత నొక చిన్న రహస్యమందిరం దగ్గరకి వచ్చాడు. అక్కడ పూర్వం మిత్రులిద్దరూ అనేక గంటలు ఉల్లాసంగా గడిపేవారు. కాని, రాజుగారి మిత్రుడు అక్కడా లేడు. ఆ గదియొక్క పరిస్థితి చూస్తే అతను అప్పుడే అక్కడనుంచి వెళ్ళిపోయినట్టుగా వుంది. పుస్తకాలన్నీ చిందర వందరగా పడివున్నాయి. గది నిండా గాజు పెంకులుకూడా వున్నాయి. ఒక చిన్నబొమ్మ నేలమీద పడివుంది. రాజు దాన్ని ఎత్తిచూశాడు. అది తనదే. ఆ ఫోటో కింద పారవేయబడటం మూలాన్నే అద్దం చితికిపోయింది. అదిచూసి రాజు హృదయం మండిపోయింది. ఆ బొమ్మను తిరిగి కింద పారేశాడు. ఆ ప్రక్కనే చిన్న మంట మండుతోంది. అందులో కాగితాలు తగలబడుతున్నాయి. ఆ మంటలో సగం తగలబడిన కాగితాన్ని ఇవతలకి లాగాడు. ఆ కాగితం తను వ్రాసిందే. తన స్నేహితుడికి రాసిన ఆఖరు ఉత్తరం అదే. మళ్ళీ దాన్ని ఆ మంటలోకి విసిరేశాడు. అప్పుడే ఆ గదిలోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఒక వ్యక్తి పురుషుడు. మరొక వ్యక్తి స్త్రీ.

"విక్రము డేడీ?" అని పురుషు డడిగాడు.

"బహుశా కొత్తరాజును అభినందించటానికి వెళ్ళివుంటాడు" అన్నదా స్త్రీ.

"అంతే అయివుంటుంది. మధ్యన మనం నలిగిపోతున్నాం. కొత్తరాజే నయం, పాతరాజుకంటె. పాతరాజు కున్న చాదస్తం, అనుమానం యీయనదగ్గర వున్నట్టు కనపడదు. విక్రముడు పాతరాజుకి అభిమానస్తు డని కొత్త రాజు అనుమానించవచ్చుగాని, విక్రముడికి భయం లేదు. సర్దుకుపోతాడు. అతను ఎలాటి పరిస్థితుల్లోనైనా ఇట్టే మారగలడు. ఎటొచ్చీ మనలాటి వాళ్ళకే చిక్కు."

ఇంకా ఏమిటో రాజకీయాల గురించీ, ఉద్యోగాల గురించీ వా రిద్దరూ మాట్లాడుతున్నారు. ఇక రాజు వినదలచుకోలేదు.

"నా ప్రజలదగ్గరికి నేను పోతాను. కనీసం వాళ్ళైనా నాయందు సానుభూతి కలిగివుంటారు. నేను నా ప్రజల కిచ్చిన హక్కులన్నీ కొత్తరాజు లాక్కుంటాడు. అందుకని వారికి అతనంటే నచ్చకపోవచ్చు." అనుకొని రాజు మళ్ళీ కదిలాడు.

అప్పుడే పావుగంట అయిపోయింది. అతనికి బీదవాళ్ళ ఇళ్ళకు వెళ్ళే మార్గాలుగూడా తెలుసు. పూర్వం అత నక్కడ మారువేషంతో కాలం గడిపేవాడు. ఆ బీదలు పడే బాధలు చూసి వారికై ఎన్నో సౌకర్యాలు చేయించాడు. అసలు తను ఏ జబ్బువల్లనైతే చనిపోయాడో ఆ జబ్బు ఆ ప్రాంతాల్లోనే తనకి పట్టుకుందని అనుమానం.

"జ్వరాలు, జబ్బులూ ఇప్పుడు న న్నేమీ చెయ్యలేవు" అనుకుని అతను నవ్వాడు. ఆ ప్రాంతాలూ, ఇళ్ళూ అన్నీ పూర్వం మాదిరిగానే అసహ్యంగా వున్నాయి. అర్ధరాత్రి అవవస్తూవున్నా అక్కడి జనమంతా మేలుకునే వున్నారు. అందరి నోళ్ళల్లోనూ తనమాటే ధ్వనిస్తోంది. తన జబ్బు, చావు, జరుగబోయే దహనక్రియలు వాటిని గురించే మాట్లాడుకున్నారు.

ఒకచోట అయిదారుగురు మత్తుగా తాగి మాట్లాడుకుంటున్నారు. వా రేమనుకుంటున్నారో విందా మని రాజు అక్కడ ఆగాడు.

"పోనీ పీడ వదిలింది. తను ఖర్చుపెట్టేదాని కంటె అదనంగా ఒక పైసాయైన ఖర్చుపెట్టలేని రాజు వుంటేనేం? పోతేనేం?" అన్నాడు అందులో ఒకడు.

"కొత్తవాడు చాలా మంచివాడుట్రా" అన్నాడు మరొకడు.

"పోనీరా, పాతోడు వొట్టి చాదస్తుడు. "మీరంతా శుభ్రంగా వుండాలి, ఆరోగ్యంగావుండా" లని ఊరికే గోలపెట్టేవాడు. మన మెలాగ వుంటే వాడి కెందుకూ—మనం ఉన్నట్టు మనల్ని ఉండనీక" అన్నాడు ఇంకొకడు.

"రాజులంతా నాశనం అవాలి! ఒకవేళ ఉంటే మనం చెప్పినట్టు వినాలి. ప్రజారాజ్యం వర్ధిల్లాలి" అన్నాడు మరొక ఉద్రేకపూరిత విప్లవకారుడు.

"పాతరాజు ఉరిశిక్షలు రద్దుచేశాడు ఎందుకో తెలుసా, నేరస్థులచేత యావజ్జీవం చాకిరీ చేయించుకుందుకు" అన్నాడు మరొకడు.

వాళ్ళమాటలు అతణ్ణి బల్లేలతో పొడిచినట్టుగా వున్నాయి. అక్కడనుంచి కదిలిపోయాడు రాజు. అప్పుడే అతని కిచ్చిన కాలంలో సగం అయిపోయింది.

అక్కడనుంచి తన రాజ్యంలోని జైలులోకి వెళ్ళాడు. ఆ జైల్లోకల్లా ఒకడే నేరస్థుడున్నాడు. అతను మోకాలిమీద కాగితంపెట్టి ఏదో రాస్తున్నాడు. రాజు అతణ్ణి ఇంతకు పూర్వం ఒక్కసారే చూశాడు.

ఆ జైలులోకి జైలు అధికారి, మరొక రాజభటుడూ ప్రవేశించారు. "ఈ చీటీ నాభార్య కందజేస్తారా?" అన్నాడు ఆ నేరస్థుడు వారిని చూసి.

"ఇం కెందుకీ ఉత్తరాలు. ఆ రాజు చనిపోయాడు. నువ్వు క్షమించబడ్డావు. కొత్తరాజు ఊహాలకీ, పాతరాజు ఊహాలకీ చాలా తేడా వుంది. బహుశా నీవు రేపు విడుదలచేయబడవచ్చు" అన్నాడు జైలు అధికారి.

"చనిపోయాడా!" అన్నాడు నేరస్థుడు ఆశ్చర్యంగా. "ఆయన నన్ను శిక్షించినా ఆయనంటే నాకు చాలా గౌరవముంది. నన్ను పెద్దమనిషిలాగ చూశాడుగాని, నేరస్థుడుగా చూడలేదు. పాపం చనిపోయాడా? ఆయన బతికుంటే బాగుండేది" అన్నాడు. అతను మాట్లాడుతూంటే కళ్ళల్లోంచి నీళ్ళుకూడా రాలాయి.

రాజు ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్ళిపోయేటప్పటికి మూడువంతులకాలం అయిపోయింది. తను మేలుచేసినవాళ్ళు తిట్టే తిట్లకంటె, కీడుచేసినవాడు పొగిడే పొగడ్త బాధాకరంగా వుంది. తను వెయ్యిసార్లైనా చావటానికి వప్పుకుంటాడుగాని, తన జీవితం అటువంటివాని సానుభూతి ఫలితంగా రక్షింపబడటం అతని కిష్టంలేదు. కాని, అతనిలో ఉదాత్తత ఉందిగాబట్టి తన అయిష్టనిలో ఉదాత్తత అతనికి కనపడింది. అతను తన పరిస్థితినంతా పూర్తిగా సింహావలోకనం చేసి చూసుకున్నాడు. తనయందు ప్రజలకు విశ్వాసం ఉందనుకునే నమ్మకం ఒట్టి మృగ్యమైంది. ఎవరికోసం తాను జీవితకాలమంతా శ్రమపడ్డాడో వారు తమ బాగునుగూడ గుర్తించుకోలేకపోయారు. ఒక అమాయకపు పిల్ల, ఒక దయగల నేరస్థుడు వీరేనా తన మిత్రులు. అట్లా అయితే తను జీవించటం ఎందుకు?

అతను గుణపాఠం నేర్చుకున్నాడు. పోయి పడుకుని, శాంతంగా, దీర్ఘనిద్రపోవటం మంచిది. అతనిలో ఆరాటం తగ్గిపోయింది. అతనికి అన్నీ నిర్దుష్టంగా కనపడుతున్నాయి.

చంద్రుడిచుట్టూ మబ్బులు దట్టంగా వున్నాయి. చలి చాలా ఎక్కువగా వుంది. అతనికి తన ఒంటరిపాటు అప్పుడు గుర్తుకు వచ్చింది. తనని హృదయపూర్వకంగా కోరేవారు ఒక్కరూ లేరా? తనని ప్రేమపూర్వకంగా చూసేవాళ్ళకి తన సర్వస్వమూ ఇవ్వటానికి సిద్ధంగా వున్నాడు.

అతని కిచ్చినకాలంలో ఇంక కొద్ది క్షణాలే వున్నాయి. తన భార్య మందిరం దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు—లోపలికి వెళ్ళడమా మానడమా అనే సందేహంతో. తన భార్యమీద ఆశగూడా నిరాశ అయితే వెనక్కి వెళ్ళిపోవటమే మంచిదిగదూ?

"నే నింతవరకూ దేనికీ జంకలేదు. భయపడుతూ ఏదీ చెయ్యలేదు. ఇప్పుడు మాత్రం జంకు దేనికి?" అనుకున్నాడు రాజు.

తన భార్య ఒంటరిగా కూర్చుంది. ఆమె ముఖం జుట్టుతో పూర్తిగా కప్పబడివుంది. ఆమెనా స్థితిలోచూసి రాజు తనని తనే తిట్టుకున్నాడు. ఆమెవంటి దాన్ని తను ఎట్లా అనుమానించ గలిగాడు?

తను ఆమె కిచ్చిన ఉంగరమే ఆమె వ్రేలినుంది. అందులో వున్న వజ్రకాంతితప్ప ఆ గదిలో మరే వెలుగూ లేదు.

ఎక్కడో కొద్ది చప్పుడు రాజును చకితుణ్ణి చేసింది. గోడలోని మర్మద్వారం తెరువబడింది. ఆ ద్వారం అక్కడ వున్నట్లు తనకీ, రాణీకీ తప్ప మరెవ్వరికీ తెలియదనుకున్నాడు. కాని అక్కడ మరొక పురుషుడు ప్రత్యక్షమయ్యాడు.

అతన్ని మాట్లాడవద్దన్నట్టుగా ఆమె అతనికి సైగచేసింది. అతని చేతుల్లో వాలిపోయింది.

"నీవు వచ్చావా, నాకు చాలా ఆనందంగా వుంది. అతను చనిపోతున్న పుడు మీద చెయ్యివేశాను. నాకు భయంగా వుంది. అతను పిశాచమై ఇక్కడికి వస్తాడేమో అనుకుంటున్నాను. కాని ఇంక రాడులే. మనమింక హాయిగా వుండొచ్చు"అని తన వ్రేలినున్న ఉంగరం అతనికి తొడిగింది. ఆ ఉంగరాన్ని ముద్దెట్టుకుంది.

అర్ధరాత్రి అవగానే పన్నెండు గంటలు కొట్టాయి. పహరావాళ్ళు నిద్రలోంచి త్రుళ్ళిపడ్డారు. రాజు మొద్దులాగ కొయ్యబారి వున్నాడు. కాని అతని ముఖంమీదమాత్రం ఒక గొప్ప మార్పు కనబడుతోంది.

"ఇక రాణీగారికి యీయన్ని చూపించ గూడదు" అన్నారు జవానులు శవంమీద ముసుగు వేస్తూ.

(మేరీ కోలెరిడ్జ్‌కి అనువాదం)

నెరసిన వెంట్రుకలకౌషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స. తెల్లని, రంగుమ మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచమైయుండిన రూ 2-8-0; మధ్యరకమైయుండిన రూ 3-8-0; పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:-ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

Kesh Ranjan Aushadhalaya,
M. 63, P.O. Ranigani (Burdwan